పద్మవ్యూహంలో గోకవరం

- గోకవరం పట్టణంలో ట్రాఫిక్ ఇక్కట్లు
- కార్యరూపం దాల్చని తాణా సెంటర్ వంతెన పనులు
- దశాబ్ద కాలంగా నిర్మాణ పనులు జాప్యం


గోకవరంలో ట్రాఫిక్ సమస్యతో నిలిచిపోయిన వాహనాలు


తాణా సెంటర్‌లో బ్రిటిష్ కాలం నాటి ఇరుకు వంతెన

గోకవరం: ఏజెన్సీ ముఖద్వారంగా పేరుగాంచిన గోకవరం పట్టణం ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారి విస్తరణ లేకపోవడం, తాణాసెంటర్‌లో ఊర కాలువపై బ్రిటిషు కాలం నాటి వంతెన స్థానంలో నూతన వంతెన కార్యరూపం దాల్చకపోవడంతో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. రాజమహేంద్రవరం, భద్రాచలం ప్రధాన రహదారి కావున సమస్య మరింత జటిలమవుతోంది. గోకవరంలో ప్రధానంగా పాతబస్టాండ్, ఆంజనేయస్వామి గుడి సెంటర్, తాణాసెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లలో ప్రతి రోజూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయా సెంటర్లలో ప్రధాన రహదారి చెంత ఉన్న దుకాణాల వద్దకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఆటోలను నిలిపి ఉంచుతున్నారు. నిత్యం గోకవరం మీదుగా రాజమహేంద్రవరం, కాకినాడ వైపు నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు పర్యాటకుల వాహనాలు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాలురాకపోకలు, ఏజెన్సీ పర్యాటకుల వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ నిలిచిపోతుంది. అదే సమయంలో స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాల అధికారులు విధులు ముగించుకోని బయటకు వచ్చే సమయం కావడంతో ఉదయం, సాయంత్రం ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ఒక్కోసారి ఈ ట్రాఫిక్ వలయంలో 108 వాహనాలు, అంబులెన్సులు సైతం ఇరుక్కుపోయి రోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

కార్యరూపం దాల్చని నూతన వంతెన

గోకవరంలో తాణాసెంటర్లో ఊరకాలువపై ఉన్న ఇరుకు వంతెన స్థానంలో నూతన వంతెన కార్యరూపం దాల్చకపోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలం అవుతుంది. బ్రిటీషు కాలం నాటి ఈ వంతెన ఇరుకుగా ఉండటం, వంతెనకు ఇరువైపులా భారీ మలుపులు ఉన్నాయి. రాజమహేంద్రవరం నుంచి ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వాహనాలు ఒక్కోసారి వంతెనపై ఇరుక్కుపోతుండటంతో వంతెనకు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. అలాగే ప్రతీ ఆదివారం మైదాన ప్రాంతాల నుంచి ఏజెన్సీకి వనవిహారం కోసం వెళ్లే వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాజమహేంద్రవరం నుంచి విజయనగరంకు 516ఈ జాతీయ రహదారి విస్తరణ చేపట్టారు. దీనిలో భాగంగా తాణా సెంటర్ వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించేందుకు నిధులు కేటాయించారు. వంతెన నిర్మాణానికి స్థల సేకరణ సైతం చేశారు. కానీ పలువురు కోర్టుని ఆశ్రయించడంతో వంతెన నిర్మాణం సందిగ్ధంలో పడిపోయింది. వంతెన నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని ఆశపడ్డ వాహనదారులకు నిరాశే ఎదురయ్యింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోకవరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై గోకవరం ఎస్సై పవన్‌కుమార్‌ని సంప్రదించగా గోకవరంలో ట్రాఫిక్‌ను సిబ్బందితో క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. రహదారిపైకి వస్తున్న వ్యాపార సముదాయాలకు నోటీసులు ఇచ్చి ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామన్నారు.

క్లుప్తంగా

సత్యదేవునికి బంగారం సమర్పణ


దేవస్థానం ఈఓ సుబ్బారావుకు బంగారం అందజేస్తున్న భక్తులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి బస్వా కాశీబాబు బ్రదర్స్ (శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస) 12 గ్రాముల బంగారాన్ని స్వామి వారికి ఆదివారం కానుకగా సమర్పించారు. ఈఓ వీర్ల సుబ్బారావుకు అందజేయగా ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రసాదాలను, చిత్రపటాలను భక్తులకు అందించారు.

భక్తిశ్రద్ధలతో అన్నసమారాధన

శంఖవరం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం శంఖవరంలో హనుమాన్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మారేడు, నేరేడు, తోరణాలు, పూల దండలతో అలంకరించారు. స్వామి వారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. భక్తి శ్రద్ధలతో భజనలు నిర్వహించారు. ఎంపీపీ పర్వత రాజుబాబు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

వైభవంగా అన్న సమారాధన

కిర్లంపూడి: మండల పరిధి బూరుగుపూడిలో వేంచేసియున్న అయ్యప్పస్వామి ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కంరించుకుని ఆదివారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో–ఆర్డినేటర్ తోట నరసింహం, రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ తోట రాంజీ స్వామివారిని దర్శించి అన్నప్రసాదాన్ని వడ్డించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువటి అసౌకర్యం కలగకుండా ఉపసర్పంచ్ పాటంశెట్టి కృష్ణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఫోరెన్సిక్స్ సైన్స్ సంచిక విడుదల


ఫోరెన్సిక్ మ్యాగజైన్ సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

గండేపల్లి: ఫోరెన్సిక్ సైన్స్ విద్యా వ్యాప్తికి పత్రిక మరింత దోహదపడుతుందని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదివారం ఫోరెన్సిక్స్ మ్యాగజైన్ 6వ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఫోరెన్సిక్ సైన్స్ పై దృష్టి సారించిన భారతదేశ మొట్టమొదటి ద్వైమాసిక పత్రికగా నిలిచిన ఫోరెన్సిక్ సంచికను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. పత్రిక రూపకల్పన చేసిన కృషిని పలువురు ప్రముఖులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్సలర్ ఎస్.శేషారెడ్డి, కార్యదర్శి రాజ్యం, ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్, వైస్ ప్రిన్సిపాల్ పి.వి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

180 మందికి వైద్య సేవలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి శ్రీ రమణా సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వ స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరాన్ని నిర్వహిచారు. ఏలేశ్వరం స్మైల్ డెంటల్ క్లినిక్ వైద్యులు స్వాతి, ఎస్.మణికంఠ, ఎస్.శివదేవి, కంటి వైద్యులు ఎ.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం శ్రీరమణా సేవాశ్రమం పీఠాధిపతి స్వామి రామానంద మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పౌష్టికాహారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఎక్సైజ్ దాడులు


బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ప్రత్తిపాడు: మండలంలోని ఉత్తరకంచి గ్రామ శివారుల్లో ఆదివారం ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది విస్తృత దాడులు నిర్వహించారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ కథనం ప్రకారం తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ కేసులో ఉత్తరకంచి గ్రామానికి చెందిన విత్తనాల శివపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ సిబ్బంది పాల్గొన్నారని సీఐ శివప్రసాద్ వెల్లడించారు.

చంద్రబాబు జీవితమే వెన్నుపోటు


ప్రత్తిపాడులో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ బులి రామకృష్ణ

ప్రత్తిపాడు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందని ప్రత్తిపాడు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ ఆరోపించారు. జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆదివారం సాయంత్రం స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణమండపం ఆవరణలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, అధినేత. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితం వెన్నుపోటుతోనే మొదలైందన్నారు. వెన్నుపోటు పొడవడంలో ఆయనకు ఎవరూ సాటి లేరని చెప్పారు. ఉచిత బస్సు, రైతు భరోసా, సంపద సృష్టి, తల్లికి వందనం తదితర సాధ్యం కానీ హామీలు ఇచ్చి, కల్లబొల్లి మాటలతో అందలం ఎక్కిన చంద్రబాబు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోదామన్నారు. ఈనెల 4న మండల కేంద్రం ప్రత్తిపాడులో నిర్వహించే 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోర్ల కాంతి సుధాకర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, పార్టీ నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, పార్టీ నాయకులు శేరు కృష్ణ, దోశి చిట్టిబాబు, రామిశెట్టి దొరబాబు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సప్తసముద్రాల దాటిన స్నేహం

అమెరికాలో ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థుల కలయిక



అమెరికా డల్లాస్ ప్రాంతంలో ఒకే వేదికపై ఆదిత్య పూర్వ విద్యార్థులతో ప్రో.చాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డి

గండేపల్లి: వారంతా ఒకే కళాశాలలో కలిసి చదువుకుని వేర్వేరు ఉద్యోగాలలో స్థిరపడి ఒకే దేశంలో నివసిస్తున్నారు. అమెరికాలో డల్లాస్ ప్రాంతంలో శనివారం రాత్రి కలుసుకుని నాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు అమెరికాలో వివిధ ప్రాంతాలలో ఉద్యోగరీత్యా స్థిరపడ్డారు. వీరంతా కుటుంబ సమేతంగా కలుసుకుని ఒకరినొకరు పలకరింపులు, యోగక్షేమాలు తెలుసుకుని ఆనాటి ముచ్చట్లు, అనుభవాలు, అనుభూతులతో ఉల్లాసంగా గడిపారని యూనివర్సిటీ ప్రో.చాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. డల్లాస్ పరిసర ప్రాంతాలలో ఉంటున్న సుమారు 80 మంది ఆదిత్య యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు తమ కుటుంబాలతో కలుసుకున్నట్టు పేర్కొన్నారు. యూనివర్సిటీ తమకు నేర్పిన విద్యాబుద్ధులు, క్రమశిక్షణ వల్లే మంచి స్థాయిలో ఉన్నామని విద్యార్థులు వారి సంతోషాన్ని తనతో పంచుకున్నట్టు డిప్యూటీ ప్రో.చాన్సలర్ ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు.

తీరనున్న విద్యుత్ కష్టాలు

జగ్గంపేట: విద్యుత్ హెచ్చు తగ్గులతో ఎన్నో నెలలుగా జగ్గంపేటలో జ్యోతుల కాలనీ వాసులు విద్యుత్ కష్టాలు ఎదుర్కొన్నారు. ఇదే విషయం మీడియాలో పలుసార్లు రావడంతో విద్యుత్ అధికారులు స్పందించారు. జ్యోతుల కాలనీ మూడో వీధిలో శనివారం 11కే.వీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పనులను ఏఈ మాధురి స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇకపై ఎటువంటి లోవోల్టేజి, హైవోల్టేజి సమస్యలు ఉండవని ఏఈ అన్నారు. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపామని స్థానిక కాలనీ వాసులు తెలిపారు. తరుచూ విద్యుత్ హెచ్చు తగ్గులతో చాలా ఇళ్లలో పరికరాలు కాలిపోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు


జగ్గంపేటలో రేషన్ డిపోను ప్రారంభించి, బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట: రేషన్ బియ్యాన్ని పేద ప్రజలకు పంపిణీ చేయడంలో డీలర్లు సక్రమంగా పనిచేయాలని, మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలో రేషన్ డిపో వద్ద బియ్యం పంపిణీని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీలర్లను ఉద్దేశించి మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని పేదలకు ఇవ్వకుండా అమ్మకాలు చేస్తే సహించేదిలేదని తెలిపారు. రేషన్ బియ్యాన్ని ఎవరు అమ్మినా నిత్యావసర వస్తువుల చట్టం క్రింద కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం రూ.47కి బియ్యం కొనుగోలు చేసి పేదలకు కేవలం రూపాయికి అందిస్తోందని దీన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

ఏలేశ్వరం: రేషన్ సరకులు సక్రమంగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. మండలంలోని సిరిపురం గ్రామంలో ఆదివారం ఆమె రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులకు సరకులను సక్రమంగా అందించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ డిపోలను నిర్ణీత సమయానికి తెరిచి ఉంచాలన్నారు. వికలాంగులు, వృద్ధులకు ఇంటికే సరకులను అందజేయాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు ప్రారంభం

రౌతులపూడి: మండలంలోని రేషన్ షాపులు పునః ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మండలంలోని ములగపూడిలో చెక్కా శ్రీరామ్మూర్తికి చెందిన రేషన్ దుకాణాన్ని సందర్శించి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం డీలర్లు సమన్వయంతో వ్యవహరించి సరకులను పంపిణీ చేయాలని సూచించారు. మండలంలోని 26 పంచాయతీల్లో ఉన్న 37 రేషన్ షాపుల్లోనూ సరకులు ఆయా డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేశారు.

గోకవరం: నెలలో 15 రోజుల పాటు నిరంతరాయంగా రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీ చేపడుతున్నట్టు టీటీడీ పాలకవర్గ సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా నిత్యవసర సరకుల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని కృష్ణునిపాలెం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా లబ్ధిదారులకు నిత్యావసరాలను అందించాలన్నారు. రేషన్ షాపులలో అవకతవకలకు పాల్పడితే తక్షణమే షాపును రద్దు చేస్తామన్నారు.

రెడ్ బుక్ రాజ్యమేలుతుంది


గండేపల్లిలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

గండేపల్లి: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యమేలుతుందని మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం పేర్కొన్నారు. గండేపల్లిలో పార్టీ అధ్యక్షుడు ముద్దిపట్ల రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి లోకేష్ ఆనాడు చెప్పినట్టుగానే రెడ్ బుక్ పాలన జరుగుతోందని, గళమెత్తి ప్రశ్నించే హక్కు ఉన్నప్పటికీ వారిపై కేసులుపెట్టి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఇంటింటికీ రేషన్ అందించాలనే ఉద్దేశ్యంతో తలపెట్టిన ఎండీయూ పథకాన్ని నిలిపివేసి తద్వారా జీవనోపాధి పొందుతున్న వారిని కూటమి ప్రభుత్వం రోడ్డుపై నిలబెట్టిందన్నారు. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజలను మోసపూరిత మాటలతో వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ తోట రాంజీ, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రామకుర్తి మూర్తి, సెక్రటరీ యాక్టివిటీ సభ్యులు గోరింట అబ్బులు, మండల ఉపాధ్యక్షుడు కందిరెల్లి కామేష్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారికి సముచిత స్థానం


కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం ఉంటుందని ప్రత్తిపాడు నియోజకవర్గం కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బెహరా దొరబాబు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మాస ఇమ్మానుయేల్, పంచాయతీరాజ్ వింగ్ ప్రత్తిపాడు మండల అధ్యక్షుడు పినిశెట్టి ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా ఇసుకపాటి సత్తిబాబు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా పులి సాల్మన్‌రాజు ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అడ్వైజరీ కమిటీ సభ్యులు (పీఏసీ) నివాసంలో ముద్రగడను, గిరిబాబును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. వివిధ పదవులకు ఎంపికైన వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం బూటకపు హామీలతో గద్దెనెక్కిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం అయిన కూటమి ప్రభుత్వానికి నిరసనగా ఈ నెల 4న చేపట్టే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజవకర్గం ప్రజానీకానికి పిలుపునిచ్చారు. ఎంపీపీ గోర్ల కాంతి సుధాకర్, మండల కన్వీనర్ రామిశెట్టి నాని, ఉపాధ్యక్షుడు మదినే నూకరాజు పాల్గొన్నారు.

తవ్వేసి.. దారి మూసేశారు


తాళ్లూరులో శీలగట్టు చెరువులోకి వర్షం నీరు పారే మార్గాన్ని మట్టితో గట్టుగా వేసిన దృశ్యం

గండేపల్లి: రాత్రికి రాత్రే చెరువు మట్టిని తవ్వేసి నీరు ప్రవహించే దారిని మూసేయడంతో వర్షం నీరు చెరువులోకి వెళ్లే పరిస్థితి లేదని రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తాళ్లూరు శివారు పొలాలకు వెళ్లే మార్గంలో గల ఊర చెరువుకు సమీపంలో ఓ ప్రైయివేటు స్కూల్ నిర్మాణం చేపట్టారు. సదరు స్కూల్ నిర్వాహకులు హైవేకి సమీపంలోని శీలగట్టు చెరువుకు వర్షం నీరు వెళ్లే మార్గాన్ని పాఠశాలకు మార్గం నిమిత్తం అదే చెరువులో తవ్వేసిన మట్టితో మూసేయడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షం నీరు చెరువులోకి వెళ్లకపోగ కాలువకు సమీపంలో గల నివాస ప్రాంతాలలోకి వర్షం నీరు చేరే అవకాశాలు ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. చెరువులో మట్టిని తవ్వి తరలించడంతో ఏర్పడిన గోతుల్లోకి నీరు చేరి పశువులు, ప్రజలు ప్రమాదాలబారినపడే అవకాశాలున్నాయని తవ్వకాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

25 ఏళ్ల అనుబంధం


2000-21లో 10వ తరగతిలో చదువుకున్న పూర్వ విద్యార్థులు

రౌతులపూడి: చదువులమ్మ చెట్టు నీడలో చెట్టాపట్టాలేసుకుని కలసితిరిగిన ఆ స్నేహితులు మళ్లీ 25 ఏళ్ల తరువాత ఆదివారం ఒకచోటుకు చేరారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని పాఠశాల ఆవరణలో ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మండలంలోని ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులంతా 25 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేస్సి, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను వారు పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. జీవితంలో స్థిరపడిన విధానాలను, పరిస్థితులను వివరించుకున్నారు. చివరగా గ్రూప్ ఫొటో దిగి తమ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో సహపక్తి భోజనాలు చేశారు.

భానుడి ప్రతాపం

తొండంగి: నైరుతి రుతుపవనాల పలకరింపుతో వాతావరణం చల్లబడిందనుకున్న ప్రజలకు రెండు రోజుల నుంచి భానుడు తన ప్రతాపాన్ని ఒక్కసారిగా చూపడంతో ఎండ తీవ్రతకు విలవిల్లాడారు. నాలుగు రోజుల క్రితం వాతావరణం మాగుడుగా ఉండి అక్కడక్కడా వర్షాలు కురిశాయి. వాతావరణశాఖ బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. కానీ మూడు రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు తారెత్తిస్తున్నాయి. ఆదివారం నుంచి ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రహదారులన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. వేడిగాలుల ప్రభావానికి ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. ప్రస్తుతం రోహిణీ కార్తి కావడంతో ఎండలు మరో వారం రోజుల పాటు ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు వడగాడ్పులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ వైద్యులు, ఏ.వి.నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవి కుమార్ సూచించారు.

పరీక్షా కేంద్రాల తనిఖీలు


మెయిన్స్ పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ నందు ఆదివారం జరిగిన ఏపీ పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పరిశీలించారు. ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు ఎగ్జామ్ కో–ఆర్డీనేటర్ రమేష్ తెలిపారు. 4,447 మందికిగాను 4,223 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నారు. ఎగ్జామ్ సెంటర్లను స్పెషల్ అబ్జర్వర్ జెఎన్‌టియుకె ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, తదితరులు పరిశీలించారన్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సై యువి శివ నాగబాబు, సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు నిర్వహించారన్నారు.

'మట్టి'లో ప్రాణాలు


నరేంద్రపట్నం గ్రామంలో బీభత్సం సృష్టించిన మట్టి ట్రాక్టర్, గుమిగూడిన ప్రజలు

జగ్గంపేట: మండలంలోని నరేంద్రపట్నం గ్రామంలో మట్టి తరలిస్తున్న ఓ ట్రాక్టర్ ఆదివారం డ్రైవర్ నిర్లక్ష్యంతో అదుపుతప్పి ఒక ఇంటి గోడను ఢీ కొట్టింది. ట్రాక్టర్ బీభత్సం సృష్టించడంతో స్థానికులు భయాందోళన చెందారు. డ్రైవర్ అతి వేగంగా ట్రాక్టర్ నడపడంతో ఇంజన్ దెబ్బతిని ఆయిల్ లీక్ అయింది. అయితే అదృష్టవ శాత్తూ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలూ కాలేదు.

అక్రమమట్టి తవ్వకాలతో బేజారు

నరేంద్రపట్నం, మామిడాడ గ్రామల పరిసరాల నుంచి గత కొద్ది రోజులుగా చెరువులు, కొండ ప్రాంతాల నుంచి అక్రమంగా మట్టి తరలించుకుపోతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తవ్వకాలు పగలు రాత్రి తేడా లేకుండా సాగుతున్నాయని, ట్రిప్‌లు ఎక్కువ వేయాలనే సంకల్పంతో లారీలు, ట్రాక్టర్లు కూడా అతి వేగంగా నడుపుతున్నారని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ఎవరి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయో అని బిక్కు బిక్కుమంటున్నారు. మట్టి తవ్వకాలపై అధికారులు ఎవరు దృష్టిసారించటం వెంటనే చర్యలు తీసుకొవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

క్వారీలో జారిపడి వ్యక్తి మృతి


రౌతులపూడి సీహెచ్‌సీలో వైద్యం అందిస్తున్న దృశ్యం

రౌతులపూడి: క్వారీలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రౌతులపూడి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు మండలంలోని ములగపూడిలోని విష్ణు మెటల్ గ్రానైట్ అండ్ సప్లయర్స్ క్వారీలో అనంతపురం జిల్లాకు చెందిన వడ్డే ఉమా మహేష్ (37) క్వారీలో డ్రిల్లింగ్ చేస్తుండగా ప్రమాదవశాతూ జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడుని రౌతులపూడి సీహెచ్‌సీ తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ తరలిస్తుండంగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఘటనపై రౌతులపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.